ప్రజాశక్తి
సోమవారం 18 డిసెంబర్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

# జగన్ మావయ్యా.. మా టీచర్లకు జీతాలు పెంచండి..



కొండపిలో అంగన్‌వాడీలతో కలిసి సమ్మె శిబిరంలో పాల్గొన్న ప్రీస్కూల్ చిన్నారులు

- అంగన్‌వాడీల సమ్మెలో చిన్నారుల విన్నపాలు
- పలు చోట్ల నిరసనల్లో పాల్గొన్న లబ్ధిదారులు
- బాపట్లలో ఆకులు తింటూ.. నిరసన
- ఆరోరోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'జగన్ మావయ్యా.. మా టీచర్లకు, ఆయమ్మలకు జీతాలు పెంచండి' అంటూ అంగన్‌వాడీ ప్రీ స్కూల్ చిన్నారులు కోరుతున్నారు. హామీల అమలు కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆరో రోజూ విజయవంతంగా కొనసాగింది. పలు శిబిరాల్లో ఆదివారం అంగన్‌వాడీ చిన్నారులూ పాల్గొన్నారు. తమ టీచర్లకు, ఆయమ్మలకు జీతాలు పెంచాలని కోరారు. ఒంగోలులో చెవిలో పూలతో అంగన్‌వాడీలు నిరసన తెలపగా.. గిద్దలూరులో కోలాటం ప్రదర్శించారు. బాపట్లలో ఆకులు తింటూ నిరసన తెలపగా.. చెరుకుపల్లిలో ఉరితాళ్లతో నిరసన తెలియజేశారు. ▶ 2లో

## 'సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటాం'

**ఒంగోలు కలెక్టరేట్:** తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో కేంద్ర కార్మిక సంఘాలు ప్రత్యక్షంగా పాల్గొంటాయని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు పివిఆర్ చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారానికి నిరవధికంగా సమ్మె చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసి సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేసిందన్నారు. అంగన్‌వాడీ సెంటర్లు తెరిపించాలని కాంట్రాక్ట్ కార్మికులు, విఆర్ఒలు, సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం తాళాలు పగలగొట్టించిందన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం, నిర్బంధాన్ని ప్రయోగించడం, బెదిరింపులకు పాల్పడటం చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు 18 నుండి ప్రత్యక్షంగా పాల్గొనాలని నిర్ణయించాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కూడా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటాయని తెలియజేశారు.



బాపట్లలో ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

# అంతా అధిష్టానం ఆట.!

- వైసిపి నేతల్లో గందరగోళం
- కొలిక్కిరాని మార్పుల వివాదాలు
- ఎవరెక్కడో తెలియక అంతా తికమక



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపి అధిష్టానం ఆట ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఏం జరుగుతుందో కూడా స్పష్టత లేదు. జిల్లా నేతలు కీలు బొమ్మలుగా మారారు. అధినేతను కలుసుకొని తమ అభిప్రాయాన్ని చెప్పుకునే అవకాశం ఒక్కరికీ రావడం లేదు. ఎమ్మెల్యేలుగా గెలవాలంటే రూ.కోట్లు ఖర్చు పెట్టుకోవాలి. నియోజక వర్గాల్లో అన్ని రకాలుగా సానుకూల పరి స్థితులు తెచ్చుకోవాలి. ఇవన్నీ అధినేతకు చెప్పు కునే అవకాశం ఒక్కరికీ రాలేదంటే ఆశ్చర్యంగా ఉంది. పోస్టింగు ఆర్డర్లు ఇచ్చినట్లుగా స్థాన చలనాలు జరిగాయి. మంత్రులిద్దరినీ నియోజకవర్గాలే మార్చేశారు. అధికారుల బదిలీ మాదిరిగానే వాళ్లు అక్కడకు వెళ్లాల్సిన పరిస్థితి. నియోజకవర్గాల్లో ఇప్పటికిప్పుడు ఎలా రాజకీయం చేయాలన్నదే ప్రశ్న. పరిస్థితులను గాడిలో పెట్టుకోవాలంటే అంతకు ముందున్న పరిణామాలు ఏమిటనే దానిపై పరిశీలనకే సమయం సరిపోతుంది. ఉన్న నియోజకవర్గాలు వదిలి బయటకు వెళ్లి రాజకీయాలు చేయడం నేతలకూ సవాలుగానే మారింది.

అధిష్టానం వ్యూహం ఎవరికీ అంతుచిక్కక అయోమయంలో పడ్డారు. నేతల పరిస్థితి చూస్తే ఎన్నడూలేని విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు పోటీ చేయడానికి వైసిపి టిక్కెట్టు రావడం అంటే లాటరీ టిక్కెట్టు తగిలినట్లుగానే ఉంది. చివరికి జిల్లా పగ్గాలు తీసుకొని పార్టీని నడిపే నేతలపైనా రకరకాల ప్రచారాలు, పుకార్లు రావడానికి కూడా అధిష్టానమే కారణంగా కనిపిస్తోంది. ఇప్పటివరకూ కొత్తగా నియమించిన సమన్వయకర్తల నియోజకవర్గాల్లో తప్ప ఎక్కడా స్పష్టత లేదు. ఎవరెక్కడ పోటీ చేస్తారనేదీ స్పష్టత లేదు. రోజుకో ప్రచారం తెరపైకి వస్తోంది. ఒక రోజు బాలినేని గిద్దలూరు అంటూ ప్రచారాలు సాగుతుంటే ..మరో రోజు పార్టీ మారుతున్నారని.. బలరాం ఒంగోలులో పోటీ అని.. ఇలా ఒక్కో నేతపై ఒక్కో తరహా ప్రచారం సాగుతోంది. పైగా నియోజకవర్గాలూ తారు మారు చేసి ప్రచారాలు చేస్తున్నారు. ఇవన్నీ పార్టీల నుంచే పుడుతున్నాయి. ఎందుకంటే పార్టీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితికి ఈ పరిణామాలే అద్దం పడుతున్నాయి. ఇదంతా అధికారం కోసం అధిష్టానం ఏకపక్షంగా చేపట్టిన రాజకీయ ఆట వల్లనే తలెత్తింది. ఈ పరిణామాలు జిల్లా నేతలను ఇరకాటంలో పడేశాయి. సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి జిల్లాను వీడి హైదరాబాదులోనే ఉన్నారు. తన పాత్ర ఏమీలేదనే అసంతృప్తిలో ఆయన ఉన్నారు. అధిష్టానం నేరుగా అన్నీ చూస్తూ ఇక్కడ జిల్లా నేతల పాత్ర గానీ, ప్రాధాన్యత గానీ, సిఫార్సులకు గానీ ఎక్కడా తావివ్వడం లేదు. ఎన్నికల వ్యూహకర్తల సర్వేల నివేదికలతోనే అన్నీ సాగిపోతున్నాయి. దీంతో ఇక్కడ అంతా తారు మారుగా మారింది. బాలినేని పాత్ర లేకుండా నియోజకవర్గాల్లో రాజకీయాలు ఎలా చేస్తారో చూస్తామంటూ ద్వితీయశ్రేణి నేతలు హెచ్చరిస్తున్నారు. ఆయన కూడా పార్టీ తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వనప్పుడు తీవ్రంగా స్పందించాల్సిన అవసరం ఏముందనే ధోరణిలో ఉన్నారు. జరిగే పరిణామాలను చూద్దామనే భావనలో ఉన్నారు. ఏం జరిగితే అదేనన్న వైఖరి ఆయనలో కనిపిస్తోంది. పార్టీ కోఆర్డినేటర్‌తో అన్ని విషయాలూ చర్చించారు. గతంలోనూ అనేక సార్లు చర్చలు సాగినా ఫలితం లేదు. అంతా అధిష్టానంలో ఒకరిద్దరి నిర్ణయాలతోనే నడుస్తోంది. ఇక్కడ ఎంతకాలం నుంచి రాజకీయాల్లో ఉన్నా ఫలితం లేదు. తలపండిన నేతలూ తలలు దించుకోవాల్సిందే.. ఆ పరిస్థితి వచ్చింది. జిల్లా రాజకీయాలను శాసించిన నేతలు సైతం ఒకరిద్దరు వైసిపిలోకి వెళ్లి ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తెలుగుదేశంలో ఉన్నప్పుడు ఎప్పుడు కావాలంటే అప్పుడు చంద్రబాబును కలిసేస్థాయి నేతలకూ.. వైసిపిలో చేరాక ఇప్పటివరకూ ఇక్కడ జగన్ అపాయింట్‌మెంటు దొరకలేదు. జగన్‌ను కలిసేందుకు యజ్ఞం చేస్తున్నారు. పార్టీలోకి ఎందుకు చేరామా? అనే పరిస్థితిని ▶ 2లో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

## 10, 11 తేదీల్లో జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన

పోస్టర్ ఆవిష్కరించిన బూచేపల్లి ▶ 2లో

# ఓటీపీతో రూ.7 లక్షలు హాంఫట్

- సైబర్ నేరగాళ్ల వలలో దోర్నాల వాసి
- బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం




ప్రజాశక్తి-పెద్దదోర్నాల

సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఎత్తుగడతో ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే పెద్దదోర్నాల వాసి ఖాతా నుంచి రూ.ఏడు లక్షలు ఆన్‌లైన్‌లో దోచేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పెద్దదోర్నాలకు చెందిన లింగాల రమేష్ తనకున్న జెసిబిని అమ్మగా వచ్చిన నగదును బ్యాంకు ఖాతాలో దాచుకున్నాడు. ఈ క్రమంలో రమేష్ అన్న లింగాల శ్రీను స్నేహితుడు ఆంజనేయరెడ్డికి సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. మీ ఖాతాలో ప్రభుత్వం నుంచి రూ.20 వేలు పడనున్నాయని, ఫోన్‌పే నెంబర్ చెప్పాలని అడిగారు. అతనిది స్మార్ట్‌ఫోన్ కాకపోవడంతో ఫోన్‌పే లేదు. దీంతో తన స్నేహితుడైన లింగాల శ్రీను నెంబర్‌కు ఫోన్ చేసి.. సైబర్ నేరగాళ్లతో మాట్లాడించారు. శ్రీను ఫోన్ నెంబర్‌కు డబ్బులేయమని చెప్పారు. సైబర్ నేరగాళ్లు శ్రీనుతో మాట్లాడుతూ మీ అకౌంట్‌లో మినిమమ్ బ్యాలెన్స్ ఉందా? అని అడిగారు. మినిమమ్ బ్యాలెన్స్ లేదని శ్రీను సమాధానమిచ్చారు. మినిమమ్ బ్యాలెన్స్ ఉన్న వారి ఫోన్‌పే నెంబర్ ఇవ్వాలని అడగడంతో తమ్ముడు లింగాల రమేష్ ఫోన్ నెంబర్ ఇచ్చి.. ఆయనకు కాన్ఫరెన్స్ కాల్ కలిపాడు. సైబర్ నేరగాళ్లు రమేష్‌తో మాట్లాడుతూ 'మీ ఖాతాలో డబ్బులున్నాయా..' అని అడిగారు. ఆయన 'ఉన్నాయి' అని సమాధానమిచ్చారు. 'మీకు ఒటిపి వస్తుంది.. అది చెబితే ▶ 2లో

## ఓటీపీతో రూ.7 లక్షలు హాంఫట్

(మొదటిపేజీ తరువాయి)

మీ అకౌంట్‌లో ఆంజనేయరెడ్డికి సంబంధించిన డబ్బులు పడతాయి' అని సైబర్ నేరగాళ్లు చెప్పారు. దీంతో అతను ఒటిపి చెప్పడంతో సుమారు 20 సార్లు మొత్తం రూ.7 లక్షలు రమేష్ ఖాతా నుంచి లాగేసుకున్నారు. తాను మోసపోయానని గుర్తించిన రమేష్ తన సోదరుడు శ్రీను, ఆంజనేయరెడ్డితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అంకమ్మరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మా టీచర్లకు జీతాలు పెంచండి..

(మొదటిపేజీ తరువాయి)

సమ్మెలో భాగంగా అన్ని ప్రాజెక్టు కేంద్రాల వద్ద ఉన్న శిబిరాల్లో అంగన్‌వాడీలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆదివారం పలు శిబిరాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి లబ్ధి పొందుతున్న తల్లులు, చిన్నారులు సమ్మెకు సంఘీభావంగా పాల్గొన్నారు. సమ్మెకు లబ్ధిదారులు మద్దతు పలికారు. తమ ఆలనాపాలనా చూసుకునే అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని తల్లులు కోరుతున్నారు. అధికారులు దౌర్జన్యంగా తాళాలు పగలగొట్టినా ఫలితం లేదు. ఎక్కడా అంగన్‌వాడీ లబ్ధిదారులకు రోజువారీ అందించే ఆహారం, ఇతర సౌకర్యాలు ఏమీ అందించలేకపోయారు. అంగన్‌వాడీలపై పంతంతో పాలకపక్ష నేతల ప్రోద్బలంతో కేంద్రాల తలుపులు పగలకొట్టడం వంటివి చేశారు. కేంద్రాల్లో రోజువారీగా అందించే సేవలను మాత్రం కల్పించలేకపోయారు. ఈ దౌర్జన్యాల వల్ల ఏమీ ఉపయోగం లేదు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల్లో మరింత వ్యతిరేకత పెంచుకున్నారు. ప్రభుత్వం తీరు పట్ల ఇప్పటికే తీవ్రంగా రగిలిపోతున్న అంగన్‌వాడీలు ఈ చర్యలతో మరింత పోరాడాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికల్లో పాలపక్ష నేతలకు బుద్ధి చెప్పాలనే ఆలోచనలో ఉన్నారు. గ్రామాల్లో తక్కువ వేతనంతో వీళ్ల జీవనం సాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లల ఆలనాపాలనా చూసుకుంటున్నారు. గత ఎన్నికలకు ముందు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన సిఎం జగన్ ఇప్పటికీ వాటిని అమలు చేయలేదు. అనేక సార్లు శాంతియుతంగా ఆందోళనలు చేసినా ఫలితం లేదు. ఐదేళ్లు గడిచాయి. అనివార్యంగా సమ్మెలోకి దిగారు. అన్ని కేంద్రాల్లో సేవలు స్తంభించిపోయాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాజెక్టుల వద్ద సమ్మె శిబిరాలు కొనసాగుతున్నాయి. పాలకపక్షం మినహా అన్ని రాజకీయపార్టీలూ అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం ప్రకటించాయి.

## అంతా అధిష్ఠానం ఆట.!

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొంటున్నారు. వైసిపిలో ఉన్న సీనియర్ల పరిస్థితీ ఇదే. ఎవరికి ఎక్కడ టిక్కెట్టు ఖరారవుతుందో కూడా తెలియడం లేదు. ఎక్కడికి పోవాలంటే అక్కడకు పోవడమేనా? పోతే గెలుపు ఎలా ఉంటుంది? సర్వేలను నమ్ముకొని రూ.కోట్లు కుమ్మరించాలా? అనే భయం నేతలను వెంటాడుతోంది. కోరుకున్న స్థానాల్లో టిక్కెట్టు కూడా రావడం కష్టంగానే మారింది. మంత్రులకే సాధ్యం కాలేదు. సిట్టింగుల్లో ఇప్పటికే ఒకరు ఎగిరిపోయారు. ఒక ఇన్‌ఛార్జి ఔట్ అయ్యారు. అందరిలోనూ ఆందోళన.. కలవరం.. ఉత్కంఠ.. తప్పడం లేదు. ఏదేమైనా అధికారం కోసం అధినేత సిఎం జగన్ ఆట ఇక్కడ నేతలకు సంకటంగా మారింది. జిల్లా నేతలందరూ కీలుబొమ్మలుగా మారారు.

# అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు అగచాట్లు

### సిఎస్ పురం మండలం రేగుల చెలకలో వెబ్ ల్యాండ్‌ను క్లోజ్ చేసిన అధికారులు

**ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్**

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం మండలంలోని రేగులచెలక రైతులకు అగచాట్లు తెచ్చిపెట్టింది. రేగులచెలక రెవెన్యూలో కొన్ని సర్వే నెంబర్లలో అక్రమాలు చోటు చేసుకోగా అధికారులు రెవెన్యూ రికార్డుల్లో మొత్తం వెబ్ లాండ్‌ను క్లోజ్ చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకునేందుకు, తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం లేకపోవడం, ప్రభుత్వ భూ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందే అవకాశాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలు జరిగిన సర్వే నెంబర్లతోపాటు అన్ని సర్వే నెంబర్‌లను వెబ్ ల్యాండ్ క్లోజ్ చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేగులచెలక రెవెన్యూలో సర్వే నెంబర్లు 224/1, 224/2, 228, 245, 263, 267/3, 267/4, 267/7, 267/8, 267/10, 267/11, 267/12, 267/13 తదితరాలలో రికార్డులను మార్చి వేసి అక్రమంగా మ్యుటేషన్‌లు చేసి క్రయవిక్రయాలు సాగిస్తుండటంపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై విచారణ చేపట్టిన అధికారులు ఆ సర్వే నెంబర్లతో పాటు, గ్రామ రెవెన్యూ రికార్డులు మొత్తాన్ని వెబ్ ల్యాండ్‌ను క్లోజ్ చేశారు. దీంతో రేగులచెలక రెవెన్యూ పరిధిలో భూములు కలిగిన రైతులు 1బి, అడంగల్‌లు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో బ్యాంక్‌లలో క్రాప్ లోన్ తీసుకునేందుకు, లోన్ తీసుకున్న రైతులు ఆ లోన్‌లను రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో లోన్ తీసుకున్న రైతులకు లోన్ రెన్యువల్ చేసుకోవాలని, లేదా లోన్ అమౌంట్ మొత్తం తిరిగి చెల్లించాలంటూ బ్యాంక్ అధికారులు రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారు. సమయానికి లోన్‌లు రెన్యువల్ చేయలేక పోవడంతో అధిక వడ్డీ చెల్లించాల్సి వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్రమాలు జరిగిన సర్వే నెంబర్లను మాత్రమే వెబ్ ల్యాండ్ క్లోజ్ చేయాల్సి వుండగా రెవెన్యూ రికార్డ్ మొత్తాన్ని వెబ్ ల్యాండ్ క్లోజ్ చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వెబ్ ల్యాండ్ ఓపెన్ చేసి ఇబ్బందులు తీర్చాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దారు షేక్ నాగుల్ మీరాను ప్రజాశక్తి వివరణ కోరగా రెండు రోజులలో గ్రామంలో గ్రామసభ నిర్వహించి అసలైన రైతుల భూములను వెబ్ ల్యాండ్ ఓపెన్ చేస్తామని తెలిపారు.

**అధికారులు పట్టించుకోవడం లేదు**
**అడియారం వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్, రేగులచెలక**



వెబ్ లాండ్ ఓపెన్ చేయాలని తహశీల్దారు ఆర్డీవో కార్యాలయాలలో అనేకసార్లు అర్జీలు అందజేశాను. అయినా పట్టించుకోవడం లేదు. క్రాప్ లోను రెన్యువల్ చేయలేక పోవడంతో మా నాన్నకు బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

**అధిక వడ్డీ కట్టాల్సి వస్తుందేమో..**
**మునగల శ్రీనివాసులు, రైతు**



1బి, అడంగల్‌లు రావడం లేదు. సమయానికి క్రాప్ లోన్ రెన్యువల్ చేయకపోతే అధిక వడ్డీ కట్టాల్సి వస్తుందేమోనని భయంగా వుంది.

**1బి, అడంగల్‌లు వచ్చేలా చేసి ఇబ్బంది తీర్చాలి**
**జాజుల వెంకటస్వామి, రైతు**



క్రాప్ లోన్ రెన్యువల్ చేయాల్సిన గడువు దగ్గర పడుతున్నది. 1బి అడంగల్‌లు వచ్చేలా చేసి రైతుల ఇబ్బందులు తీర్చాలి.

## ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ నోటిఫికేషన్ ఇవ్వాలి

### దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఇటీవల గ్రూప్-2 ఉద్యోగాల నోటిఫికేషన్‌ను జగన్ ప్రభుత్వం ఇచ్చిందని, ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. సమితి కార్యాలయంలో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల నోటిఫికేషన్ జగన్ ప్రభుత్వంలో ఎండమావిగా మారిందని విమర్శించారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత జులై 2వ తేదీ 2021 సంవత్సరంలో జీవో ఆర్‌టి నెంబర్ 181 ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో ఉన్న 1,238 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ప్రకాశం జిల్లాలో ముఖ్యంగా డ్రైవర్ పోస్టులు 24 ఎస్సీ,ఎస్టీ 9 మొత్తం కలిపి 33 పోస్టులు ఇచ్చారన్నారు. అలాగే కుక్, అటెండర్ వాచ్‌మెన్ లాంటి పోస్టులు 32 కాగా అందులో 18 ఎస్టీ లకు 14 ఎస్సీలకు ఇచ్చారన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు మరల బ్యాక్ లాగ్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి నిరుద్యోగులు ఆటోలు నడుపుకోవడానికి ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ల నుంచి ఇచ్చే ఆటో రుణాలను ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఎస్సీ ఎస్టీ నిరుద్యోగులు కార్లు, ట్రాక్టర్లు, ఇతర వ్యాపారాలు చేసుకోవడానికి ఇందిరాగాంధీ ప్రభుత్వం కాలం నుంచి అమలులో ఉన్న ఎన్ఎస్ఎఫ్‌డిసి, ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి పథకాలను జగన్ ప్రభుత్వం అటకెక్కించిందని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపు గ్రూప్-2 ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చినట్టే ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల నోటిఫికేషన్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత అధ్యక్షులు దారా అంజయ్య, తానికొండ ఆనంద్, కాకుమాను రవి, పాలేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.




నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ

## రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ ప్రారంభం

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్‌ను స్థానిక ఎంపిడీఓ కార్యాలయంలో ఆదివారం ప్రారంభించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ చైర్మన్‌గా శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా శిఖాకొల్లి ధనలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు బీవీ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ట్రెజరర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సివి వెంకటేశ్వరరెడ్డి, స్థానిక తహశీల్దారు పిన్నిక మధుసూదనరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు శివం ఫౌండేషన్ ఫౌండర్ గొల్లపూడి శ్రీహరి, మండల పరిషత్ ఏఓ బిఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు. కమిటీ సభ్యులుగా కే వెంకటేశ్వర్లు, ఎం మల్లికార్జున్, ఎస్ మల్లారెడ్డి, పి శ్రీనివాసరావు, సిహెచ్ రామ్‌గోపాల్ మార్పుడి పాపారావు (కార్యదర్శి) లను ఎన్నుకున్నారు. వక్తలు మాట్లాడుతూ సేవలు చేయడం మహా భాగ్యమని, ఇండియన్ ప్రెస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా సేవలు అందించాలని పరిశీలకులు కోరారు. మూడు సంవత్సరాల పాటు నూతన కమిటీ బాగా పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని కోరారు.

## వైసిపి పబ్లిసిటీ విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీగా గొలమారి

### ఎస్సీ సెల్ సెక్రటరీగా గూడూరి స్వప్న

**ప్రజాశక్తి-పొదిలి**

వైసిపి ప్రకాశం జిల్లా పబ్లిసిటీ విభాగం జాయింట్ సెక్రటరీగా పొదిలికి చెందిన సీనియర్ నాయకులు గొలమారి చెన్నారెడ్డిని నియమించారు. అదేవిధంగా జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీగా మాజీ ఎంపిటిసి గూడూరి స్వప్న వినోద్‌ను నియమిస్తున్నట్లు ఉత్తర్వులు అందాయి. మార్కాపురం నియోజకవర్గం శాసనసభ్యులు కెపి నాగార్జునరెడ్డి కృషి ఫలితంగా తమకు పార్టీ బాధ్యతలు అప్పగించడంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. శాసన సభ్యులు కెపి నాగార్జునరెడ్డి, మార్కాపురం, కంభం మాజీ ఎమ్మెల్యేలు కెపి కొండారెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



గొలమారి చెన్నారెడ్డి



గూడూరి స్వప్న


### పంచాయతీరాజ్ విభాగం

## జనరల్ సెక్రటరీగా యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి-పిసి పల్లి**



కనిగిరి నియోజకవర్గం పంచాయతీరాజ్ విభాగం జనరల్ సెక్రటరీగా యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి లభించేందుకు కృషి చేసిన కనిగిరి శాసన సభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన పెద చెర్లోపల్లి మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా నిర్వహించి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. మోహన్‌రెడ్డిని జెసిఎస్ కన్వీనర్ శీలం సుదర్శన్, మురుగుమ్మి వైసిపి నాయకులు లెక్కల మణికంఠ రెడ్డి, నలగంగు శ్రీను, బోరెడ్డి బాలకోటయ్య తదితరులు అభినందించారు.




పురస్కారం అందుకుంటునన మాధవరావు

## 'మద్దాళి'కి పురస్కారం

**ప్రజాశక్తి-చీమకుర్తి**

అభయకళారాధన అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఇందిరాగాంధీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని శెట్టిబలిజ భవనంలో కెఆర్.ఫౌండేషన్ మరియు లిటిల్‌చాంప్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాధవరావు అవార్డు అందుకున్నారు. అభయకళారాధన సంస్థ ఆధ్వర్యంలో గత ఇరవై ఏళ్ళుగా మాధవరావు అందిస్తున్న వివిధ రంగాల సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేశారు. డాక్టర్ బి.నాగరాజు,కె బుచ్చేశ్వరరావు చేతుల మీదుగా మాధవరావు అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలజ, సుధాదేవి నాయుడు, గంగవరపుపద్మ,నాట్యగురువులు పిలక్ష్మి, తులసి, శేషభట్ల రజితాచార్య పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

## టిడిపిలో చేరిక

**శింగరాయకొండ :** శింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు ఆదివారం టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కండవాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో తేజ రెడ్డి, సురేందర్‌రెడ్డి, బ్రహ్మయ్య, ఏడుకొండలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండలపు గాంధీ చౌదరి, సర్పంచి సైకం చంద్రశేఖర్, బతరాజగోపాల్‌రెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్చం అందజేస్తున్న వైసిపి నాయకులు

## మంత్రిని కలిసిన వైసిపి నాయకులు

**కొండపి :** కొండపి మండలానికి చెందిన వైసిపి రాష్ట్ర నాయకులు డాకా పిచ్చిరెడ్డి, వేముల రమేష్ వైసిపి నాయకులు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మంత్రి డాక్టర్ సురేష్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మండలంలో వైసిపి పరిస్థితి గురించి మంత్రితో చర్చించారు.

## పెన్షనర్లకు సన్మానం

**చీమకుర్తి :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్‌డే ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మినారాయణ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పెన్షనర్స్‌డే ఆవశ్యకతను వక్తలు వివరించారు. అనంతరం 75 ఏళ్ళ పైబడిన పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బండ్ల డేవిడ్, గౌరవాధ్యక్షుడు ఆజాద్, దోమలపుల్లయ్య,ఎన్. హరిప్రసాద్ ,పి.సుబ్బారావు,ఉమా మహేశ్వరరెడ్డి, దేవరాజులు, రమణారెడ్డి.కె. సుబ్బారావు, గౌస్,చెంచయ్య, కోటేశ్వరరావు, బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది

# పెన్‌డౌన్‌కు ఉపాధ్యాయ సంఘాల మద్దతు

**ప్రజాశక్తి-చీమకుర్తి**

సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది చేపట్టిన పెన్‌డౌన్‌కు యుటిఎఫ్, ఎపిటిఎఫ్, ఎస్‌టియు నాయకులు మద్దతు ప్రకటించారు. గత మూడు నెలలుగా సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బందికి వేతనాలు ఇవ్వలేదు. కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని చాలాకాలంగా సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఈనెల 16 నుంచి 20 పెన్‌డౌన్ చేపడుతున్నారు. ఎంఇఒలు వెంకటేశ్వర్లు, శివాజీకు నోటీసులు అందజేశారు. పెనడౌన్ చేపట్టిన సర్వ శిక్ష అభియాన్ సిబ్బందికి యుటిఎఫ్ జిల్లా నాయకుడు పి.రమేష్, ఎపిటిఎఫ్ నాయకుడు జె.యాకోబు, ఎస్‌టియు నాయకులు డి.నాగయ్య మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు కె.జయరావు, బొడ్డు ఏడుకొండలు, వేమా వెంకటరావు, రామసుబ్బయ్య, విక్టోరియారాణి, డి. మాలకొండయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ప్రసాదు, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



పెన్‌డౌన్ నోటీసులు అందజేస్తున్న సమగ్ర శిక్ష అభిఅయాన్ సిబ్బంది

వైసిపి యువజన విభాగం

# జిల్లా జాయింట్ సెక్రటరీగా 'మొగిలిశెట్టి'

**ప్రజాశక్తి-చీమకుర్తి**

వైసిపి యువజన విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీగా మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. అందులో భాగంగా మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ , మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని ఆదివారం వారి నివాస గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు భీమన వెంకటరావు, పతి కోటేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ పాలడుగు సుబ్బారావు, సూది శ్రీను, సూది శ్రీకాంత్,కె. సుబ్రహ్మణ్యం, ఉల్లి సుబ్బారావు,పి. నాగేశ్వరరావు, రాయల్లకోటయ్య పాల్గొన్నారు.



బూచేపల్లివెంకాయమ్మ,శివప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న మొగిలిశెట్టి

### వైసిపి బిసి సెల్ జిల్లా కార్యదర్శిగా బాషా

చీమకుర్తికి చెందిన ఎస్‌కె.ఖాదర్‌బాషా వైసిపి జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి,ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబుకు ఈ సందర్భంగా ఖాదర్ బాషా కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్‌పి 'మెడల్' అందుకోవడం హర్షణీయం

**ప్రజాశక్తి-చీరాల**

జిల్లాలో గంజాయి కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకున్న చర్యలకు ఈ నెల 16న మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ డిజిపి కమాండేషన్ గోల్డ్ డెస్క్ మెడల్ అందుకోవడం హర్షణీయమని సామాజిక కార్యకర్త తేళ్ళ రాంబాబు తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, ప్రకాశం జిల్లా ఎస్‌పి మల్లిక గర్గ్ అవార్డులు అందుకున్న సందర్భంగా ఈపురిపాలెంలోని విద్యా భారతి స్మార్ట్ స్కూల్‌లో ఆదివారం రాంబాబు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈపురిపాలెం ఎస్ఐ జనార్దన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ 2022లో జిల్లాలో దిశ, బెస్ట్ కన్విక్షన్ పోలీసింగ్, ముఖ్యమైన కేసులకు సంబంధించిన దర్యాప్తు, కోర్టు షెడ్యూల్ మేరకు ట్రైల్ జరిపించి, స్వయంగా కేసు పురోగతి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నేరస్తులకు శిక్ష పడే విధంగా తీసుకున్న చర్యలకు ఎస్‌పికి గోల్డ్ మెడల్ రావటం అభినందనీయమన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పర్యరక్షణకు ఎస్‌పి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ జనార్దన్

## మద్యం బాటిళ్లు స్వాధీనం

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. హనుమంతునిపాడుకు చెందిన కొండయ్య వద్ద 10 బాటిళ్లు, చిన్నమ్మ అనే మహిళ వద్ద ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కొండ చిలువ పట్టివేత

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

మండల పరిధిలోని మిల్లంపల్లి టోల్‌గేట్ సమీపంలోని పిల్లికుంట తాండాలో 12 అడుగుల భారీ కొండ చిలువ కలకలం లేపింది. కొండ చిలువను గుర్తించిన గిరిజనులు భయాందోళనతో స్నేక్ రిస్క్యూవర్ మల్లికార్జునకు సమాచారం అందించారు. మల్లికార్జున అక్కడికి వెళ్లి కొండ చిలువను పట్టుకున్నారు. 12 అడుగులు పొడవు ఉందని తెలిపారు. దీన్ని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో వదిలి వేస్తామని తెలిపారు.

## జనసేన పార్టీలో చేరిక

**ప్రజాశక్తి-కంభం రూరల్**

మండల పరిధిలోని తురిమెళ్ల గ్రామంలో పది కుటుంబాల వారు జనసేన పార్టీలో చేరారు. జనసేన మండల అధ్యక్షులు తాటిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెల్లంకొండ సాయిబాబు, మండల ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి లోకేష్, బేస్తవారిపేట మండల అధ్యక్షుడు ముంతల మధున సుదనరెడ్డి, దుమ్మని చెన్నయ్య పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం

## రాష్ట్ర సహాయ కార్యదర్శిగా 'చేరెడ్డి'

**ప్రజాశక్తి - గిద్దలూరు**



గిద్దలూరు పట్టణానికి చెందిన చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి వైసిపి యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. వైసిపి యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డికి పలువురు నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత

**కొమరోలు :** మండల పరిధిలోని తాటిచర్ల గ్రామానికి చెందిన సూరే రాజమ్మ కుటుంబ పరిస్థితి రెక్కాడితే డొక్కాడని కుటుంబం. ఆమె కుటుంబ పరిస్థితి గురించి గ్రామస్తులు అమ్మ ఫౌండేషన్ దష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు బాధిత కుటుంబానికి గ్రామస్తుల సమక్షంలో రూ.5 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సేవాసంస్థ సభ్యులు అన్నపురెడ్డి మల్లికార్జున రెడ్డి, బొమ్మని రవి, పందిళ్ల పుల్లయ్య ,సంసాని కాశిరావు , మేకల చిన్న నరసింహులు , పాల్వాది వేంకటేశ్వర్లు , బొమ్మని శ్రీనివాసులు , మేకల నరసరాయుడు , పల్లాల బాలస్వామి పాల్గొన్నారు.

# అధ్వానంగా పారిశుధ్యం.. ప్రజలకు అవస్థలు

**ప్రజాశక్తి-పొదిలి**

పొదిలి పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దీంతో ప్రజల అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువలు పూడిక నిండిపోయాయి. దీంతో కాలువల్లోని నీరు ముందుకు కదలడం లేదు. ఫలితంగా దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కారణంగా దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. పొదిలి మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మార్పు చెందినప్పటికీ తమ బతుకుల్లో ఎలాంటి మార్పు లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన జనాభాకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో ప్రధాన వీధులు తప్ప ఇతర ప్రాంతాల్లో పారిశుధ్య పేరుకు పోతుంది. మురుగునీరు రహదారి మీద నిల్వడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు ఎబిఎం కాంపౌండ్ ప్రజలు వాపోతున్నారు. చెత్తాచెదారంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.



రహదారిపై నిలిచిన మురుగునీరు

# అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

◆ బాపట్లలో ఆకులు తింటూ నిరసన ◆ చీరాలలో చిన్నారుల అభ్యర్థన ◆ చుండూరులో చెవిలో పువ్వు క్యాలీఫ్లవర్ తో నిరసన ◆ చెరుకుపల్లిలో ఉరి తాళ్లతో అంగన్వాడీల నిరసన


చుండూరులో చెవిలో క్యాలీఫ్లవర్లతో అంగన్‌వాడీల నిరసన


కొల్లూరులో పువ్వులు పంచుతూ అంగన్‌వాడీల నిరసన

**ప్రజాశక్తి - బాపట్ల**

ఆకులు తింటూ అంగన్వాడీ కార్యకర్తలు వినూత్నంగా సమ్మెలో నిరసన తెపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద చేపట్టిన అంగన్వాడీల సమ్మె ఆదివారానికి 6వ రోజుకు చేరింది. తమ జీతాలు పెంచండి బాబోయ్ అంటూ ఆకులు తింటూ అంగన్వాడీలు నినాదాలు చేశారు. యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శైలశ్రీ మాట్లాడుతూ మహిళలనే కనికరం లేకుండా ఆడవాళ్ళని రోడ్డుమీద ఇబ్బంది పెట్టినందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్వాడి కార్యకర్తలకు సిఎం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. కానిపక్షంలో రాబోయే రోజుల్లో రాజకీయ పార్టీలు, ఉద్యోగ, కార్మిక సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేయటానికి వెనుకాడ బోమని హెచ్చరించారు. అరవై రోజులైనా సమ్మె కొనసాగిస్తామని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే సమ్మె ఉధృతం చేయాలనే నిర్ణయానికి వచ్చామని అన్నారు. అంగన్వాడీల సమ్మెకు యుటిఎఫ్ నాయకులు మద్దతు ప్రకటించారు.

**కారంచేడు :** అంగన్వాడి కార్యకర్తలు చేస్తున్న సమ్మె 6వ రోజుకు చేరింది. ఆదివారం సెలవు రోజైనప్పటికీ తహశీల్దారు కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. సిఐటియు నాయకులు పి కొండయ్య మాట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ప్రయత్నించాలని కోరారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేసి సమ్మె పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో లబ్ధిదారులైన నూతలపాడు భూలక్ష్మి, కంచర్ల కౌసల్య, ఉదయగిరి


రేపల్లెలో చిన్నారులతో లబ్ధిదారుల ధర్నా

సుభాషిని, లక్ష్మి పిల్లలతో పాటు యూనియన్ నాయకులు ప్రాజెక్టు కార్యదర్శి జి అనిత, ఎస్ఆర్ రాణి, జీ రాణి, బి రాధా పాల్గొన్నారు.

**చీరాల :** జగన్ మామయ్య మా టీచర్ల జీతాలు పెంచాలి. అంటూ అంగన్వాడీ కేంద్రాల చిన్నారులు తమ టీచర్లు చేస్తున్న సమ్మెలో పలకలపై అభ్యర్థనను ప్రదర్శించారు. తమ టీచర్లే తమకు కావాలని, అంగన్వాడి కేంద్రాల తాళాలు పగలగొట్టవద్దు అంటూ పలకలపై రాసుకొని నిరసన తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీల దీక్షలు 6వ రోజుకు చేరాయి. అంగన్వాడీ కార్యకర్తలకు విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు నిరసన దీక్షకు మద్దతు తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ ఎలిజిబెత్ మాట్లాడుతూ అంగన వాడి కార్యకర్తలు శాంతియుతంగా నిరసన చేస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహ రిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తూ చట్ట విరుద్ధం గా వ్యవహరిస్తుందని అన్నారు. తమ డిమాండ్స్ పరిష్కారం అయ్యేవరకు సమ్మెని చేస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు, ఎన్ బాబు రావు, జి సుజీవన, జ్యోతి, అరుణ, ప్రసన్న కుమారి, లత, సులోచన పాల్గొన్నారు.

**కొల్లూరు :** 6వ రోజు అంగన్వాడి కార్యకర్తలు కనీస వేతనాలు పెంపుదల చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని సమ్మె కొనసాగించారు. రోడ్లు వెంబడి వస్తూపోతున్న ప్రజలకు, బస్సులు, ఇతర వాహనాలు ఆపి పువ్వులు ఇచ్చి వి నూత్నంగా నిరసన తెలిపారు.

**భట్టిప్రోలు :** అంగన్వాడీల కోర్కెలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరింది. మండల కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు వినూత్న రీతిలో పాటలతో కవాతు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ విద్యార్థులు జగన్ మామయ్య మా టీచర్లు, ఆయాలకు జీతాలు పెంచు మామయ్య అంటూ పలకలపై వ్రాసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షులు రమాదేవి పాల్గొన్నారు.

**రేపల్లె :** అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నపిల్లల దేవాలయాలని, అలాంటి కేంద్రాల తాళాలు పగలగొట్టారని అన్నారు. ధర్నా శిభిరం వద్దకు లబ్ధిదారులు వచ్చి మద్దతు తెలిపారు. ప్రీస్కూల్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు నడిపేందుకు యాప్‌లు ఆటంకంగా ఉన్నాయని అన్నారు. ప్రీ స్కూల్ నిర్వహించాలంటే అదనపు బాధ్యతలు తగ్గించాలని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై బెదిరింపులుకు పాల్పడటం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డి జ్యోతి, ఎన్ కృష్ణకుమారి, నాగమణి, వెంకటేశ్వరమ్మ, రజిని, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

**చుండూరు :** అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అవడమేగాక కేంద్రాలను పొలుగు, గొడ్డళ్లతో పగలగొట్టించటం సరైనది కాదని సిఐటియు నాయకులు బొనిగల ఆగస్టిన్ అన్నారు. తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడిల నిరవధిక సమ్మె 6వ రోజుకు చేరింది. అంగనవాడీలు చెవిలో క్యాలీఫ్లవర్‌లను పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అగస్టిన్ మాట్లాడుతూ డిమాండ్స్ పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రత్నకుమారి, కామేశ్వరి, సుజాత, సరళ, రాణి పాల్గొన్నారు.

**చెరుకుపల్లి :** అంగన్వాడీ కార్యకర్తల సమస్యలపై ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంబిస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మనిలాల్ అన్నారు. అతి తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బెదిరింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఆరవ రోజున ఉరితాళ్ళతో నిరసన తెలిపారు.


చీరాలలో చిన్నారులతో జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజిబెత్


ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రేస్ ఫౌండేషన్ ప్రతినిధి

## మృతుని కుటుంబానికి సాయం

**ప్రజాశక్తి - భట్టిప్రోలు (చుండూరు)**

చుండూరు మండలం ఆలపాడు గ్రామానికి చెందిన కూచిపూడి ప్రసాద్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రసాద్ మృతి చెందటంతో కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మానవతా దృక్పథంతో గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి శాలెం రాజు తన వంతు ఆర్థిక సహాయంగా మట్టి ఖర్చులకు రూ.5వేలు అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకొనేందుకు గ్రేస్ ఫౌండేషన్ వెన్నంటి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బందేల సురేష్, మూల్పూరు సీతయ్య, నల్లూరు రవి, గొరిగిపూడి జగ్గారావు, పచ్చికళ్ళ అనిల్, వి సతీష్, దున్న శ్రీనివాసరావు, నల్లూరు సురేష్, సుబ్బారావు, సుధీర్ పాల్గొన్నారు.


పీకేసిన మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎడి అబ్దుల్ సత్తార్

## పంటల పరిశీలన

**ప్రజాశక్తి పర్చూరు**

మిచంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను ఎడి అబ్దుల్ సత్తార్ మండలంలోని చేరుకురు, రమణాయ పాలెం, పోతుకట్ల గ్రామాల్లో దెబ్బతిన్న పొగాకు, మిరప, మినుము, మొక్కజొన్న పంటలను ఆదివారం పరిశీలిం చారు. మండలంలో పొగాకు 13000 ఎకరాలు, మొక్కకొన్న 700ఎకరాలు, మినుము 125 ఎకరాలు, పెసర 120ఎకరాలు, మిరప 2800 ఎకరాలు, వరి 600 ఎకరాలు వరకు నష్ట పోయినట్లు అంచనా వేశారు. పంట నష్టపోయిన రైతులు వివరాలు ఆర్‌బికెల్లో నమోదు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఎఒ రామమోహనరెడ్డి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



యానాదులకు నిత్యావసరాలు అందిస్తున్న కె రవి ప్రదీప్

## బాధితులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - నగరం**

మండలంలోని మీసాలవారిపాలెం కట్టపైన నివసిస్తున్న యానాది సంఘంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సమస్తం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలిన యానాది కుటుంబాలకు, సంఘంలోని 31కుటుంబాలకు స్థానిక సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కొమరాబత్తిని రవి ప్రదీప్ బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, గోధుమపిండి, బంగాళదుంపలు, వంట నూనె ప్యాకెట్లుతో కూడిన కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమరగిరి నాగేశ్వరరావు, పేట్ల మరియజ్యోతి, కట్టుపల్లి చారుశీల, మల్లెల శ్రీనివాసరావు, ఇండ్ల సాంబయ్య, నంబూరి వెంకటేశ్వరమ్మ, సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

**రేపల్లె :** క్రిస్మస్ పండుగ సందర్భంగా నేతాజీ నగర్‌కు చెందిన 40మంది పేద పిల్లలకు స్వెట్టర్లు జీసస్ బ్లెస్సింగ్ మినిస్ట్రీ విచారణ కర్త బ్రదర్ కె విజయ రాజు ఆదివారం అందజేశారు. ఏసు ప్రభువు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దయా గుణాలు కలిగి ఉండాలని, తోటి వారికి సహాయపడే లక్షణం అలవర్చుకోవాలని పేర్కొన్నారు.


స్వెట్టర్లు అందిస్తున్న విజయరాజు

## అశోక్‌బాబు పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

వైసిపి ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకున్న వరికూటి అశోక బాబు జన్మదిన వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అశోక్ బాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలతో సత్కరించారు. స్థానిక ఎంఎల్‌ఎ, మంత్రి మెరుగు నాగార్జునకు అందించిన సహాయ సహకారాలే అశోక్ బాబుకు కూడా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గాలి అరవింద, కోఆప్షన్ సభ్యులు షేక్ సలీం, వైసిపి యువజన విభాగం నాయకులు పప్పుల గ్రేడ్ అరుణ్ శాస్త్రి, వైసీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, సర్పంచి దారా రవికిరణ్మయి, చెన్నయ్య, ఉపసర్పంచ్ బూర్లే రాంప్రసాద్, కోటేశ్వరరావు, ఐలవరం సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, మాచర్ల హేంసుందర్రావు, జొన్నాదుల శరత్, తులసీ రంగారావు పాల్గొన్నారు.


అశోక్‌బాబును సత్కరిస్తున్న నేతలు

## గెలిచి జగన్‌కు గిఫ్ట్‌గా ఇద్దాం : హనిమిరెడ్డి

**ప్రజాశక్తి - అద్దంకి**

సిఎం జగన్ ఆదేశాలకు అనుగుణంగా వైవి సుబ్బారెడ్డి ఆశీస్సులతో అద్దంకి గడ్డపై గెలిచి జగన్‌కు గిఫ్ట్ గా ఇస్తానని నూతన ఇంఛార్జి పానెం హనిమి రెడ్డి అన్నారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆదివారం తొలిసారి నియోజకవర్గానికి వచ్చారు. తొలుత సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రం ప్రాంగణంలోని టిటిడి కళ్యాణ మండపంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తాను అద్దంకిలోనే నివాసం ఉంటానని అన్నారు. వైవి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యుల అండతో ప్రజలకు సేవలు అందించే భాగ్యం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తనకు కల్పింస్తారని అన్నారు. బుధవారం నుండి ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. ప్రతి గడపకు తిరిగి సమస్యను తెలుసుకొని పరిష్కారం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, బివి కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఈదాశ్రీ నివాసరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

## పేదలకు వస్త్రాలు పంపిణీ

**ప్రజాశక్తి - చీరాల**

క్రిస్టమస్ పండుగ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని ప్రజా వేదిక గుమ్మడి యేసు రత్నం అన్నారు. క్యాలండర్ ఆవిష్కరించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. పాస్టర్ దేవరపల్లి డేవిడ్ ప్రార్థన చేయించారు. చిట్టెమ్మ పాల్గొన్నారు.


చీరలు పంచుతున్న ఏసురత్నం

## ఇన్‌ఛార్జి గణేష్ ప్రత్యేక పూజలు

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

వైసిపి ఇన్చార్జి డాక్టర్ గణేష్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీ సువర్చలా సమేత శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గణేష్‌ను దృశ్యాలవాలతో అభినందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు రావూరి ఆంజనేయులు, తూనుగుంట్ల శ్రీనివాసరావు, మర్రివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వైసిపి ఇన్‌ఛార్జి గణేష్ పూజలు

ప్రజాశక్తి 5
సోమవారం 18 డిసెంబర్ 2023

# వినూత్న రీతిలో అంగన్‌వాడీల నిరసన

- ఒంగోలులో చెవిలో పువ్వులు పెట్టుకొని ర్యాలీ
- మద్దిపాడు, కొండపిలో సమ్మెకు చిన్నారులు, తల్లిదండ్రుల మద్దతు
- వైపాలెంలో మోకాళ్లపై కూర్చొని నిరసన

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీల చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా నాయకులు కె.ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు కెవి.సుబ్బమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడి సమస్యల పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్‌కి ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ సమ్మెను ఆపేదిలేదని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి తంగిరాల మహేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. అంగన్‌వాడీ సెంటర్లు తాళాలు పగలగొట్టి సెంటర్లు నడిపే పద్ధతిని మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హెమిమో, సిహెచ్.జ్యోతి, కె.సంధ్యారాణి, పద్మ, శేషమ్మ, నిర్మల, శ్రీదేవి, కష్ణకుమారి అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **మద్దిపాడు :** అంగన్‌వాడీల సమ్మె ప్రీస్కూల్ పిల్లల తల్లులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.కల్పన మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ధనలక్ష్మి ఎన్.జయప్రద, అంగన్‌వాడీలు రజిని, రాధా, ప్రమీల, ఆదిలక్ష్మి, మేరీ, ప్రభావతి, శారద, కళ్యాణి పాల్గొన్నారు. **దర్శి :** అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని సిఐటియు డివిజన్ కార్యదర్శి తాండవ రంగారావు తెలిపారు. ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా తాండవ రంగారావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం ఆదేశించడం దుర్మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సందు వెంకటేశ్వరరావు, ఈమని నాగేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అచ్చమాంబ, షేక్ ఫాతిమా, సువర్ణలత, సుభాషిణి, బాలమ్మ, ప్రశాంతకుమారి, తిరుపతమ్మ, శివకుమారి, సుజాత, మల్లేశ్వరి, ఫర్వీణ్, లక్ష్మీదేవి, దేవమ్మ, ప్రజానాట్య మండలి నాయకుడు మోహన్‌రావు పాల్గొన్నారు. **కొండపి :** అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీల ధర్నాలో చిన్నారులు పొల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తమ వెట్టి చాకిరి చేయిస్తూ కనీస వేతనం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.వందనం, వై.రూబెన్, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **వెలిగండ్ల :** అంగన్‌వాడీల సమ్మెకు బాలింతలు, గర్భిణులు, చిన్నారులు మద్దతు తెలిపారు. మద్దతు తెలిపారు. ఈ కారక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు సిహెచ్.రఫియా, రెడ్డెం తిరుపతమ్మ, దమ్ము పద్మావతి, అనిశెట్టి నారాయణమ్మ పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు అండగా ఉంటామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మోళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెకు ఎరిక్షన్‌బాబు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వకుండా వారి చేత వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కో ఆర్డినేటర్ షేక్ అమీర్‌బాషా, టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి బోడా చెన్న వీరయ్య, టిడిపి నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, తోటా మహేష్ నాయుడు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సుభాషిణి, సునీత, అరుణ, జయమ్మ, నాగరాజుకుమారి, సుబ్బులు పాల్గొన్నారు.



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



మద్దిపాడులో సమ్మెకు మద్దతు తెలిపిన చిన్నారులు, తల్లిదండ్రులు



దర్శిలో మాట్లాడుతున్న తాండవ రంగరావు



గిద్దలూరులో కోలాటం ద్వారా నిరసన



వైపాలెంలో మోకాళ్లపై కూర్చొని నిరసన



మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మూర్తి

## 'ఆలూరి' ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్

### 250 మందికి ఉచిత వైద్యసేవలు

**ప్రజాశక్తి-ఒంగోలు**

ఆలూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు వారి ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపును 39వ డివిజన్ పీర్లమాన్యంలో నిర్వహించారు. ఈ క్యాంపులో మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ ఎవి. సుందర్రావు, డాక్టర్ సాయి గణేష్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ అనసూయ వైద్యసేవలందించారు. కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, తిరుమలరావు మాట్లాడుతూ ఈ క్యాంపులో సుమారుగా 250 మంది పేషెంట్లకు ఉచితంగా వైద్యసేవ లందించడమే కాక ఉచితంగా మందులు కూడా అందజేశారని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మూర్తి సాతులూరి మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో పాల్గొన్న ప్రతి ఒక్క పేషెంట్‌కూ ఉచిత ప్రివిలేజ్ కార్డును ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్డు ద్వారా ఉచిత కన్సల్టేషన్‌ను సంవత్సరం పాటు ఉపయోగించుకోవచ్చని చెప్పారు. దీంతో పాటుగా 20 శాతం ల్యాబ్ పరీక్షల మీద రాయితీని, ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ అయిన వారికి 15 శాతం రాయితీని ఇస్తామని తెలిపారు. ఈ క్యాంపులో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రమా, మెడాల్ డయాగ్నస్టిక్స్ లాబొరేటరీ సిబ్బంది తదితరలుఉ పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

### కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని దాచర్ల ఆంజనేయులు కాలనీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తొలుత టిడిపి జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆర్‌టిసి బస్టాండ్, జివిఆర్ రోడ్డు, మసీదు వీధి, కందుకూర్ రోడ్డులో ఇంటింటికీ తిరిగి మహిళలతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకొస్తే అమలు చేసే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, కూనపు రెడ్డి వెంకట సుబ్బారావు, మాజీ వైస్ ఎంపిపి కూనపురెడ్డి హైమావతి, వార్డు సభ్యురాలు ఆలా నాగమణి, ఓలేటి రవిశంకర్ రెడ్డి, షేక్ సంబానీ బాషా, సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, చిగురుపాటి శేషగిరి పాల్గొన్నారు.

## 207 మందికి వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

మండల పరిధిలోని ఈదుమూడి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 'మనం-మన ఊరు-మన ఈదుమూడి' సేవాసంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు ఆధ్వర్యంలో శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వారి సహకారంతో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ పేదలకు వైద్యం భారంగా మారిన నేపథ్యంలో తమ సంస్థ ద్వారా ప్రతి నెలా మూడో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్ డాక్టర్ ధీరజ్ బాబు, జనరల్ సర్జన్ డాక్టర్ విజయ్ కుమార్ ,పెడియాట్రిక్స్ వైద్యులు డాక్టర్ హరికష్ణ, డాక్టర్ ప్రసాదు, జనరల్ వైద్యులు డాక్టర్ కె సౌమిత్ర పల్లవ 207 వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో శ్రీరామ్ ఆస్పత్రి మేనేజరు దాసరి సుధాకర్ యాదవ్ ,పిఆర్ఒలు రవి, నాగరాజు, మల్లికార్జున, పున్నయ్య,హాస్పిటల్ సిబ్బంది, సేవాసంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సురేష్

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సురేష్

**మార్కాపురం :** మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సమస్త జనులు సంతోషంగా ఉండాలని కోరుకునే వారని, ఆయన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. సమాజంలో ఎవరు ఇబ్బందులు పడినా తోచిన సాయం అందించి ఉదారతను చాటుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సుల్తాన్‌ను సన్మానిస్తున్న నాయకులు

## సుల్తాన్‌కు సన్మానం

**శింగరాయకొండ :** శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఫకీర్ పాలెంకు చెందిన షేక్ సుల్తాన్ వైసిపి బీసీ సెల్ జిల్లా సెక్రెటరీగా నియమితులయ్యారు. అందులో భాగంగా సుల్తాన్‌కు వైసిపి ముస్లిం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో షేక్ సలీం, షేక్ పటేల్, షేక్ కరీం, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.



చీమకుర్తిలో బూచేపల్లి నివాసంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడి భజన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దంపతులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- ప్రజాశక్తి, చీమకుర్తి

# 'వైట్‌బర్లీ'తో రైతుకు సిరులు

## గతంలో లేని విధంగా క్వింటాకు రూ.15 వేలు • వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తగ్గిన దిగుబడులు

**ప్రజాశక్తి-దర్శి**

ఈ ఏడాది వైట్‌బర్లీ పొగాకు పంటకు మంచి గిరాకీ రావడంతో రైతులకు సిరుల పంటగా మారింది. క్వింటా రూ.15 వేలకు జీపీఐ, ఐటీసీ కంపెనీ వారు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు బొటుకు చిన్న శేషయ్య, కొండలరావు తెలిపారు.

దర్శి మండలం చందలూరు, వెంకటాచలంపల్లి, అబ్బాయిపాలెం, బసిరెడ్డిపల్లి, బండివెలిగండ్ల, యర్రఓబనపల్లి, వెంకటాపురం తదితర గ్రామాల్లో మెట్టపైర్లలో వైట్‌బర్లీ పొగాకు పంటలు సాగు చేశారు. దాదాపుగా 12వందల ఎకరాలకు పైగా పొగాకు పంటను రైతులు వేశారు. అయితే వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా గత ఏడాది 10 క్వింటాళ్లు పండిన పంట ఈ ఏడాది మూడు నాలుగు క్వింటాళ్లకు దిగుబడి మాత్రమే వస్తున్నట్లు రైతులు పేర్కొన్నారు. నీటి అవకాశం ఉన్న రైతులకు మాత్రం ఎకరాకు 10 క్వింటాళ్లు పండుతుందని రైతు చిన్న శేషయ్య తెలిపారు. తనకున్న పొలంలో ఈ ఏడాది ఎకరన్నర వైట్‌బర్లీ వేశానని, ఒకసారి నీరు పెట్టినందువలన ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి 50 వేలు పెట్టుబడి పెట్టామని, అయితే ప్రకృతి అనుకూలిస్తే ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని తెలిపారు. క్వింటాకు రూ.15 వేలు లెక్కన రూ.1.50 లక్షలు ఆదాయం వస్తుందని, గతంలో ఈ రేటు ఎప్పుడూ లేదని అన్నారు. ప్రస్తుతం జీపీఐ కంపెనీ వారు గతేడాది గరిష్టంగా రూ.11,500కు కొనుగోలు చేస్తే ఈ ఏడాది కనిష్టంగా రూ.15 వేలు పలుకుతోందని, రైతులకు ఈ ఏడాది వైట్‌బర్లీ సిరులు కురిపిస్తుందని అన్నారు. అయితే వర్షాభావ పరిస్థితుల వల్ల కొంతమంది రైతులకు నీరు లేక మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, దానికి పెట్టుబడి మాత్రమే వస్తుందని అన్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు నీరు పెట్టిన పంటలకు పది క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని చలివేంద్రంకు చెందిన మాజీ సర్పంచ్ కొండలరావు తెలిపారు. తాను ఈ యేడాది 1.70 ఎకరాల్లో సాగు చేశానని, ఒక తడి నీరు పెట్టానని, పది క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని అన్నారు. అన్ని ఖర్చులు పోయినా కూడా ఇదే రేటు ఉండి ప్రకృతి అనుకూలిస్తే లక్ష రూపాయిలు వరకు ఎకరాకు మిగులుతుందని అన్నారు. తుపాను వచ్చినప్పుడు చెట్లన్నీ వరిగిపోయాయని, మరలా కూలీలతో సరిచేసినట్లు తెలిపారు. ఈ రోజు పొగాకు కొట్టి ట్రాక్టర్‌కు వేస్తున్నట్లు తెలిపారు. కూలీల రేట్లు కూడా బాగా ఉన్నాయని, పంట దిగుబడులు వస్తేనే ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు.



వైట్‌బర్లీ పొగాకును గుచ్చుతున్న కూలీలు



వైట్‌బర్లీ పొగాకును ట్రాక్టర్‌కు ఎత్తుతున్న కూలీలు



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్‌డిఓ జాన్ ఇర్విన్, ఎంపిడిఓ సుకుమార్

## పేదలకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి-వెలిగండ్ల**

వెలిగండ్ల ఎంపిడిఓ తాతపూడి సుకుమార్ పుట్టిన రోజు మరియు సెమీ క్రిస్మస్ వేడుకలు వెలిగండ్ల బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కనిగిరి ఆర్‌డిఓ పాలపర్తి జాన్ ఇర్విన్, ఎంపిడిఓకు శుభాకాంక్షలు తెలిపి, క్రిస్మస్ సందేశం అందించారు. ఈ కార్యక్రమానికి వెలుగు పిడి టి రవికుమార్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కనిగిరి ఆర్‌డిఓ పాలపర్తి జాన్ ఇర్విన్ చేతుల మీదుగా ప్రజలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు, కనిగిరి దుర్గం బాప్టిస్టు చర్చి సంఘ పెద్దలు, వెలిగండ్ల చర్చి సంఘ పెద్దలు, యువకులు, స్త్రీలు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ జమకాల ఓబయ్య

## డాక్టర్ ఓబయ్యకు అవార్డు

**ప్రజాశక్తి-సిఎస్ పురం**

సిఎస్ పురం మండల పరిధిలోని వి బైలు గ్రామానికి చెందిన డాక్టర్ జమకాల ఓబయ్యకు నీసా సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు-2023 లభించింది. ఈ మేరకు లక్నోలోని సిఎస్ఐఆర్-నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ (నీసా) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో శనివారం ఆయన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి అమ్రిత్ అభిజాత్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ ప్రతి ఏడాది పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన అధ్యాపకులను గుర్తించి అవార్డులను ప్రదానం చేస్తుంటుంది. ఈ క్రమంలో జమకాల ఓబయ్యను 2023వ సంవత్సరంలో నీసా సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఆచార్య షకీల్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందిన డాక్టర్ జమకాల ఓబయ్య గతంలో కూడా పలు అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఓబయ్యకు అవార్డు లభించడం పట్ల పలువురు గ్రామ పెద్దలు, ప్రజలు అభినందనలు తెలిపారు.

## కాట్వా ఎమినెంట్ పర్సన్‌గా 'ఆకుపాటి'

**ప్రజాశక్తి-పామూరు**



వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కనిగిరి నియోజకవర్గ కాట్వా ఎమినెంట్ పర్సన్‌గా పామూరు పట్టణ రెండో ప్రాదేశిక ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్ వరుసగా మూడోసారి ఎంపికయ్యారు. పదో తరగతిలో 550 మార్కులు పైబడిన ఐదుగురు విద్యార్థులకు రూ.15 వేలు తనవంతుగా స్కాలర్‌షిప్ రూపేణా అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఏపీ కాట్వా కమిటీ ఆధ్వర్యంలో ఆకుపాటి వెంకటేష్‌ను ఘనంగా సన్మానించి మెమొంటోను బహూకరించారు.

## నిరంకుశ వైసీపీకి పరాజయం తప్పదు

**ప్రజాశక్తి-కనిగిరి**




మాట్లాడుతున్న జివి కొండారెడ్డి

ప్రజా సమస్యలు పట్టించు కోకుండా నిరంకుశ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి పరాజయం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి అన్నారు. కనిగిరి పట్టణం లోని సుందరయ్య భవనం లో ఆదివారం పీసీ కేశవరావు అధ్యక్షతన సిపిఎం పట్టణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి జివి కొండారెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని శాంతియుతంగా సమ్మె చేస్తుంటే పరిష్కరించకుండా అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి స్టాక్ స్వాధీనం చేసుకోవడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ లేక నిరుద్యోగులు, విపత్కర పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిన్న, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతాంగం ఇబ్బంది పడుతున్నా, ధరల భారంతో ప్రజలు అల్లాడుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టకపోవడం దారుణమని అన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తూ నియంతృత్వ పాలనను సాగిస్తూ హక్కులను కాలరాస్తోందని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. లేకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు, ఎస్కే బషీరా, కొండలరావు, ఆర్ ఏడుకొండలు, ఎం కొండారెడ్డి, శాంతకుమారి, యు పిచ్చయ్య, కృష్ణమూర్తి, నరేంద్ర, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి పాస్టర్స్ యూనియన్ నాయకులు

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**



కాంగ్రెస్ పార్టీలో చేరిన కొనకనమిట్ల పాస్టర్స్ యూనియన్ నాయకులు

కొనకనమిట్ల మండల పాస్టర్స్ సువార్తికుల యూనియన్ అధ్యక్షుడు నిశనం ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో యూనియన్‌కు సంబంధించిన నూతన కార్యవర్గం మొత్తం 13 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మార్కాపురం నియోజకవర్గ బాధ్యులు షేక్ సైదా సారథ్యంలో మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్ తులసిరెడ్డి పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ తులసిరెడ్డి, షేక్ సైదా మాట్లాడుతూ దళితులు, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అనాదిగా అండదండలందిస్తూ వారి సంక్షేమానికి, వారి పురోభివృద్ధికీ పాటుపడు తోందని అన్నారు. బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు బడుగు, బలహీన వర్గాల వ్యతిరేక పార్టీలని వారన్నారు. ప్రధానమంత్రి మణిపూర్ మారణ హెూమాన్ని ఆపలేని అసమర్థుడు అని వారు విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో దళితులు, మైనార్టీల మీద దాడులు ఎక్కువయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో సువార్తికులు అందరూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని వారు కోరారు. పాస్టర్ యూనియన్ అధ్యక్షులు నిశనం ఇమ్మానియేల్ మాట్లాడుతూ తమ యూనియన్‌లో 150 మంది సభ్యులు ఉన్నారని, తామందరం సమైక్యంగా రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు నిశనం ఇమ్మానియేల్, ఉపాధ్యక్షులు సిహెచ్ ఆనందరావు, కార్యదర్శి గొంగటి రాజేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ పలపాటి రాజు, కోశాధికారి గొంగటి లాబాను, కార్యవర్గ సభ్యులు కోలా రూబేను, పొలపాటి మార్కు, గుంటి బాలయేసు, పొట్లూరి తిమోతి, జి డానియల్, నిశనం గురవయ్య, విడుదల ఇర్మియా, యద్దనపూడి ఇస్సాకు తదితరులు పార్టీలో చేరారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**ప్రజాశక్తి-సిఎస్ పురం**



'బాబు ష్యూరిటీ' కార్యక్రమాన్ని నమోదు చేస్తున్న రజబ్ బాషా

టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ రజబ్‌బాషా తెలిపారు. సిఎస్ పురం టౌన్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ పురంలో బూత్ నంబర్ 84, మండ్లపాడులోని బూత్ నంబర్ 64లను ఆయన పరిశీలించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ ఏ విధంగా నమోదు చేస్తున్నారనే దానిపై పరిశీలన చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు బి వెంగయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు షేక్ షాను, గజ్జల కోటిరెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు సన్మానం

**ప్రజాశక్తి-కనిగిరి**



ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కనిగిరి వచ్చిన సందర్భంగా ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్లో టిడిపి శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం టిడిపి నాయకులు శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చేలా పార్టీ శ్రేణులు సైనికుల వలె కృషి చేయాలని సూచించారు. కనిగిరి ప్రాంత అభివృద్ధి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ద్వారానే సాధ్యమవుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, తమ్మినేని వెంకటరెడ్డి, చింతలపూడి తిరుపాలు, ఈదర రవికుమార్, చిలకపాటి లక్ష్మయ్య, నజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

రేషన్ మాఫియా పెచ్చరిల్లు తుంది. ప్రతినెలా బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారు. బియ్యం మాఫియా కొల్లూరు, వేమూరు మండలాల నుండి కూడా సేకరిం చి లారీల ద్వారా తరలిస్తున్నారు. వీరి అక్రమాలకు బియ్యం పంపిణీ వాహనాలే ప్రధానం కావటం గమనార్హం. గ్రామాల్లో డీలర్ల వద్ద మిగిలిపోయిన బియ్యం గుట్టు చప్పుడు కాకుండా వాహన దారులు అక్రమార్కుల వద్దకు చేర్చి వాటిని లారీలకు ఎక్కిస్తూ ఉంటారు. స్థానికంగా దీపాల శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు ఇరువురు అన్నదమ్ములు గత కొన్నేళ్లుగా బియ్యం అక్రమ రవాణా నిర్వహిస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ మామూలు పుచ్చుకొని చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తు న్నారనే ఆరోపణ ఉన్నాయి. గత కొన్ని నెలలుగా బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి బియ్యాన్ని స్వాధిని చేసుకున్న సంఘటన ఉన్నాయి. కానీ వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి సంబంధిత బాధ్యులైన శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావులపై పిడి చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. అయినప్పటికీ వ్యాపారం మాత్రం ఎక్కడా ఆగలేదు. కొనసాగుతూనే ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో ఓ రేషన్ వాహన నుండి బియ్యాన్ని అక్రమంగా లారీకి ఎక్కిస్తుండడంతో కొందరు స్థానికులు ఫోటోలు, వీడియోలు తీయడం తో అది కాస్త సామాజిక మధ్య మాలో వైరల్ అయింది. దీంతో మండల స్థాయి అధికారులు అప్రమత్తమై బియ్యం వాహన దారులందరినీ తహశీల్దారు కార్యాలయానికి పిలిపించి హెచ్చరించినట్లు తెలిసింది.



అధికారుల అదుపులో రేషన్ ట్రక్కులు (ఫైల్‌ఫోటో)

**అక్రమార్కులు ఎవరనేది తెలిసినా చర్యలేవి?**

భట్టిప్రోలు కేంద్రంగా చేసుకొని వివిధ మండలాల నుండి రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ముఠా ఎవరనేది తెలిసినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. రేషన్ మాఫియా అధికార పార్టీ నాయకులు, అధికారుల కనుసనల్లోనే జరుగుతుందని ఆరోపిస్తున్నారు. దీని కారణంగానే అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక పెట్రోల్ బంక్, మార్కెట్ యార్డు సమీపంలో అర్ధరాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా లారీలకు ఎక్కించి తరలిస్తున్నప్పటికీ రాత్రి వేళల్లో బీటు కానిస్టేబుల్ గాని, రెవిన్యూ సిబ్బంది గానీ, విజిలెన్స్ అధికారులు కానీ గంటలకు కొద్దీ జరిగే బియ్యం లోడింగ్ వ్యవహారం కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రేషన్ అక్రమ తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బాపట్లలో వైసిపి నుండి టిడిపిలో చేరిన వారితో నరేంద్రవర్మ

## వైసిపి నుండి టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి - చీరాల**

వైసీపీ పాలనతో విస్తుపోతున్న ప్రజలు టిడిపిని కోరుకుంటున్నారని టిడిపి ఇంచార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో లక్ష్మీ శ్రీనివాస్ కాలనీకి చెందిన 20కుటుంబాలు వైసీపీ నుండి టిడిపిలో చేరారు. పసుపు కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానిం చారు. తుమ్మ సుభాన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆసాది శ్రీనివాసరెడ్డి, జై బాబురెడ్డి, సత్యనారాయణరెడ్డి, బాలాజీరెడ్డి, బ్రహ్మారెడ్డి, మణికంఠరెడ్డి, నాగరాజు, రఫీ, దేవరాజు, శివారెడ్డి, చందు, పోతురాజు, మనీ చేరారు. విజయనగర కాలనీ చెందిన 20కుంటుబాలు వైసీపీ నుండి యువ నాయకులు గౌరీ అమర్నాథ్ టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. తెలుగు యువత పట్టణ అధ్యక్షులు లావేటి శ్రీనివాస్ తేజ ఆధ్వర్యంలో అనిల్ తేలా, దినేష్, శ్రీనివాస్, భాస్కర్, వంశీ, అనిల్, వినయ్, అజయ్ కుమార్, సుబ్బారావు, అశోక్, మదన్, శామ్యూల్, బుజ్జి టిడిపిలో చేరారు.

**బాపట్ల :** మండలంలోని ముత్తాయపాలెం పంచాయతీలోని చింతావారిపాలెంలో 25మంది వైసీపీ కార్యకర్తలు టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ సమక్షంలో టిడిపిలో చేరారు. ముత్తాయపాలెం మాజీ ఎంపీటీసీ జాన్ వేస్లీ, కాగిత జోసప్ ఆధ్వర్యంలో పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తోట నారాయణ, ముక్కామల సాంబశివరావు, మోదుగుల శంకరరెడ్డి, మద్దాల ముసలయ్య, వడ్లమూడి వెంకటేశ్వర్లు, కావూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## యువతకు నైపుణ్యాభివృద్ధి సదస్సు

**ప్రజాశక్తి - చీరాల**

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో నేడు స్థానిక ఎన్జీఓ భవనంలో యువతకు ఉద్యోగ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు డిబిఆర్‌సి ఏరియా కో-ఆర్డినేటర్ వి భగవాన్ దాస్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు నిరుద్యోగ యువతీ, యువకులకు అవగాహన కల్పిస్తారని అన్నారు.

## అన్నదానంకు రూ.40 వేల విరాళం

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల అన్నదానంకు ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ రూ.40వేల విరాళం అందజేశారు. 41రోజుల పాటు నిర్వహించే అన్నదానకు కూరగాయల ఖర్చుల నిమిత్తం టిడిపి నాయకులు దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, ఎంఆర్‌కె మూర్తి, వంగర శ్రీనివాస చక్రవర్తి, విశ్వంశెట్టి శ్రీనివాసరావు, నాగుల పున్నారావు, టిడిపి మండల అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, దివి శ్రీనివాసరావు అందజేశారు.

## 'మంజూష' గ్రంథం ఆవిష్కరణ

**ప్రజాశక్తి - అద్దంకి**

సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో రామసుశీల నిలయంలో జరిగిన ఆత్మీయపురస్కారసభకు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. జ్ఞాపకాల పుట్ట పుట్టంరాజని, మనసుని దోచే సంఘటలనను కథలుగా మలచి, రసవత్తర కావ్యాన్ని వ్రాశారని చంద్రశేఖర్ కితాబు ఇచ్చారు. మంజూష గ్రంథాన్ని ఆవిష్కరణ చేసిన డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ మానవ సంబంధాలు, జీవన విధానం, అనుభవాలు, అనుభూతుల సమ్మేళనమే మంజూష కావ్యమని అన్నారు. ఈ కావ్యాన్ని సరళ సుందరంగా పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి వ్రాశారని పుస్తక సమీక్షకులు శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఉమ్మడి కుటుంబాలలోని ఒద్దికను, ఆచార వ్యవహారాలను, సామాజిక, ఆర్థిక విషయాలను ప్రస్ఫుటించిందని డాక్టర్ యు దేవపాలన అన్నారు. సభలో డివిఎం సత్యనారాయణ మాట్లాడుతూ, మంజూష కావ్యం అనుభవాల సారమని అన్నారు. కావ్యంలోకి దిగగానే మన ప్రమేయం లేకుండానే గతకాలానికి వెళతామని అన్నారు. ఆ ప్రాంతాల్లోకి వెళతామని, ప్రతి అనుభూతి మన అనుభూతిగా భావిస్తామని ఆర్‌వి రాఘవరావు అన్నారు. పాఠకులను ఏకబిగిన చదివించే విధంగా ఉనందని లక్కరాజు శ్రీనివాసరావు, ఇలపావులూరి శేషతల్పశాయి అన్నారు. అనంతరం పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, ధర్మపత్ని శైలజను సాహితీ మిత్ర మండలి పట్టు వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి రుద్రయ్య, కె బాలకృష్ణారెడ్డి, మురళీ సుధాకరరావు, కార్యదర్శి కెవి పోలిరెడ్డి, చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, జమ్మలమడక హనుమంతరావు, వామరాజు వెంకటేశ్వర్లు, ఓరుగంటి ప్రసాదరావు, కొండకావూరి కుమార్, మిట్టా కామేశ్వరశర్మ, అద్దంకి లెవీప్రసాదు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కూరపాటి రామకోటేశ్వరరావు, పసుపులేటి ఆంజనేయులు, అళహరి హరిబాబు, ఎన్ రాఘవ, పిసిహెచ్ కోటయ్య, ధర్ణవరపు సీతారామయ్య, జె ప్రతాప్, లక్కరాజు సాంబశివరావు పాల్గొన్నారు.

## ఉచితంగా రక్త పరీక్షలు

**ప్రజాశక్తి - పర్చూరు**

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్చూరు అపోలో డయాగ్నొస్టిక్ వారిచే ఉచిత రక్త పరీక్షలు రోటరీ భవనంలో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ కట్టా యోగానంద్, డాక్టర్ పేర్ని మౌనిక, డాక్టర్ మనీషా ప్రజలకు షుగర్, కొలెస్ట్రాల్, ఇతర పరీక్షలు చేశారు. వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. నివారణ చికిత్సలు అందచేశారు. ఎజిపి కట్టా సాల్మన్ శిభిరాన్ని ప్రారంభించారు. ఉచిత మెడికల్ క్యాంపులతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న రోటరీ క్లబ్‌ను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నాగబైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ సభ్యులు కెఎస్‌ఆర్‌కె ప్రసాద్, పాబొలు ఉదయ భాస్కర్, కొల్లా నరేంద్ర కుమార్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, పోలిశెట్టి చంద్రం, నాగుబడి సుబ్బారావు, కొల్లా సుబ్బారావు, తెళ్ళ రమేష్ చంద్ర పాల్గొన్నారు.

## పేదలకు సేవలందించాలి

**ప్రజాశక్తి - చినగంజాం**

సర్పంచ్ రాయని ఆత్మరావు నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని పంచాయతీలోని పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రజల దృష్టిలో మంచి పేరు తెచ్చుకొని పలువురికి ఆదర్శంగా నిలవాలని క్రిస్మస్ క్యారల్స్ నిర్వాహకుడు మేకల మేషక్ బాబు అన్నారు. క్రిస్మస్ క్యారల్స్ లో భాగంగా అంబేద్కర్ నగర్‌లోని సర్పంచ్ నివాసం నందు సండే స్కూల్ చిన్నారులకు, యూత్ సభ్యులకు సర్పంచ్ దంపతులు ఆతిధ్యాన్ని అందజేశారు. సర్పంచ్ ఆత్మరావు, రాజ్యలక్ష్మి దంపతులను షాలువాతో సత్కరించి మదర్ తెరిసా చిత్రపటాన్ని బహూకరించారు. క్రీస్తు మార్గం అనుసరణీయమని అన్నారు. ప్రజలందరూ శాంతి మార్గం లో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో కందుల పృథ్వి, మార్పు సన్నీ, మేడికొండ సునీల్, మార్పు బాబి, మేడికొండ నిఖిల్, అజయ్, బెన్ని, నిహాల్, అరుణ్ పాల్గొన్నారు.



వైసిపి ఇన్‌చార్జి గణేష్‌తో పోలీసు అధికారులు

## గణేష్‌ను కలిసిన పోలీసులు

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

వైసిపి నూతన ఇన్చార్జి డాక్టర్ ఈవూరి గణేష్‌ను పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. డిఎస్పి మురళీకృష్ణ, రూరల్ సీఐ శివశంకర్, టౌన్ సీఐ, చెరుకుపల్లి ఎస్ఐ వై సురేష్, ఎస్ఐ వెంకటరవి, నగరం, నిజాంపట్నం, అడవులదీవి, చోడయపాలెం స్టేషన్ల పరిధిలోని అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## దాడి చేసిన వారిని శిక్షించాలి

**ప్రజాశక్తి - బాపట్ల**

గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలో ఇటీవల రజక మహిళ నిడుబ్రోలు శివకుమారిపై కాకుమాను ఎంపీటీసీ భర్త బ్రహ్మాజీ దాడి చేసి గాయపరచటాన్ని బీసీ సంఘాలు ఖండించాయి. ఎంపీటీసీ భర్త చేతిలో గాయపడి బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న శివకుమారిని బీసీ సంఘాల నాయకులు ఆదివారం పరామర్శించారు. బీసీ జెఎసి అధ్యక్షులు గొర్ల శ్రీనివాసరావు, శీలం రోజన్ బాబు, కృష్ణ చైతన్య, ఉప్పలదీన్నే గోపీనాథ్, పులిగడ్డ శ్యాంప్రసాద్, సిరిగిరి మహేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పూసపాడులో ఉచిత వైద్య సేవలు

**ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్**

మండలంలోని పూసపాడులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యంగా ఉంటేనే మనిషి మనుగడ ఉంటుందని అన్నారు. అనుభవజ్ఞులైన డాక్టర్లు డాక్టర్ కోటా ప్రగతి, డాక్టర్ అనూష బేగం, డాక్టర్ కరణం హేమంత్, డాక్టర్ శివాజీ పాటిబండ్ల వైద్య సేవలందించారు. ఈసీజీ, ఎక్స్ రే, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో రోటరీ ట్రెజర్ స్రవంత్ కుమార్, సర్వీస్ ప్రాజెక్ట్ అభయ, గోప్పలపూడి అశోక్, ఎం వీరయ్య, నవీన్ చక్రవర్తి, ప్రభాకర్, గౌరీ శంకర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా చదవాలి

**ప్రజాశక్తి - చీరాల**



అంబేద్కర్ చిత్రపటానికి నివాళి

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు మరో 90రోజుల్లో రాయబోతున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ డిడి డి రాజా డెబోరా కోరారు. స్థానిక శ్రీ మేధావి కళాశాల ప్రాంగణంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు ఆదివారం నిర్వహించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదివే నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులు మంచి మార్కులే లక్ష్యంగా కృషిచేసి సత్ఫలితాలు పొందాలని సూచించారు. తొలుత బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు అభ్యసన సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారి సైదారెడ్డి, సబ్జెక్ట్ నిపుణులు పవని భానుచంద్ర మూర్తి, రాణెమ్మ, ఎల్ శ్రీనివాసరావు, సత్యానందం, పాలేటి సురేష్ పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న యర్రం శ్రీనివాసరెడ్డి

## వాలీబాల్ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - పంగులూరు**

క్రిస్టమస్ సందర్భంగా మండలంలోని తూర్పు కొప్పెర పాడులో జై భీమ్, వైఎస్‌ఆర్ రాష్ట్రస్థాయి వాలీబాల్ ట్రోఫీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఆటల పోటీలు యువతకు ఎంతో అవసరం అన్నారు. ఐక్యతను, ఆరోగ్యాన్ని, పట్టుదలను పెంచేందుకు ఆటలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించటం ఎంతో ఆనందంగా ఉందని తూర్పు కొప్పెరపాడు సొసైటీ అధ్యక్షులు గొల్లపూడి నాగేశ్వరరావు అన్నారు. ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమాలు యువతలో ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. అద్దంకి, రావినూతల టీంలు మధ్య పోటీ జరిగింది. ఒక పాయింట్ తేడాతో అద్దంకి టీం విజయం సాధించింది. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నల్లమల అజిల్, గాదే బ్రహ్మారెడ్డి, తూర్పు కొప్పెరపాడు ఉపసర్పంచి ఎలమంద, మాజీ సర్పంచ్ పెయింట్ సుబ్బారావు, రాయిని వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం ఉంటే చర్యలు

**ప్రజాశక్తి - బాపట్ల రూరల్**

అక్రమంగా మద్యం కలిగి ఉన్నా, విక్రయాలు, రవాణా చేసినా చర్యలు ఉంటాయని సెబ్ సీఐ సుంకర శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని బేతపూడి గ్రామంలో వ్యక్తి వద్ద 10మద్యం క్వార్టర్ బాటిళ్లు ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.



క్లాసులు బోధిస్తున్న సిద్ధయ్య, పూనాటి ఆంజనేయులు

# ప్రజలపై భారాలు వేస్తున్న ప్రభుత్వాలు

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని, ప్రజలపై భారాలు వేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం ఒంగోలు నగర పార్టీ సభ్యులు, కార్యకర్తల శిక్షణా తరగతులు రెండో రోజు జరిగాయి. ఈ తరగతులకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వై.సిద్ధయ్య మాట్లాడుతూ బిజెపి రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్రాల హక్కుల్ని హరించి వేస్తుందని, దేశంలో ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని తెలియజేశారు. తక్షణం ఉపాధి అవకాశాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆ దిశగా ఉపాధి చూపించే పరిస్థితిలో లేదన్నారు. పట్టణ ప్రజలపై అనేక రకాల పన్నుల భారాలను వేస్తోందని, పన్నుల భారాలతో ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ప్రజల అభివద్ధిని మరిచిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని, పాలస్తీనా ప్రజానీకాన్ని ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ సిపిఎం ప్రజలకు ప్రత్యామ్నాయ విధానాలను తెలియజేయడం జరిగిందన్నారు. ప్రజల అభివద్ధిని కోరుతూ , అసమానతలు లేని రాష్ట్ర అభివద్ధి కోసం, రాష్ట్రంలో ప్రజా అనుకూల విధానాలు అమలుకు సిపిఎం ఉద్యమిస్తోందన్నారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతుందని, సమస్యల ప్రాతిపదికన సిపిఎం పనిచేస్తుందన్నారు. ప్రజలపై ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో చెత్త పన్ను, నీటి పన్ను ,ఇంటి పన్ను పెరిగిపోయాయని, విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయన్నారు. ఈ పెరుగుదలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. జిల్లాలో కరువు సమస్యను పరిష్కరించాలన్నారు. ఒంగోలు నగరంలో మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్య, దోమల బెడదను పరిష్కరించి, ఇల్లు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. తరగతులలో సిపిఎం నగర కార్యదర్శి గంగవరపు రమేష్ నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, ఎస్‌డి హుస్సేన్, నగర కమిటీ సభ్యులు కె.శ్యామ్, దారా వెంకటేశ్వర్లు, కొర్నెపాటి శ్రీనివాసరావు, టి.మహేష్, ఏ శ్రీనివాసరావు, సిపిఎం నగర కార్యకర్తలు పాల్గొన్నారు.



టార్పాలిన్ పట్టలు పంపిణీ చేస్తున్న డాక్టర్ కనకదుర్గ

# రైతులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ

**ప్రజాశక్తి-మార్కాపురం**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మార్కాపురం సబ్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ చేతుల మీదుగా రైతులకు అవసరమైన టార్పాలిన్ పట్టలు ఆదివారం సాయంత్రం పంపిణీ జరిగింది. మార్కాపురం ప్రాంతంలోని 60 మంది రైతులు టార్పాలిన్ పట్టలను అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కెజె నరసింహా, గుంటక సుబ్బారెడ్డి, శ్రీధర్ సాయి, సుబ్బారావు, చెన్నకష్ణ తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో

# జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన

**పోస్టర్ ఆవిష్కరించిన బూచేపల్లి**

**ప్రజాశక్తి-దర్శి**

బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా సంక్రాంతి సంబరాల్లో భాగంగా జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన వచ్చే నెల 10, 11 తేదీల్లో దర్శిలో జరుగుతుందని, ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం బూచేపల్లి స్వగృహం వద్ద జాతీయ స్థాయి ఒంగోలు ఎడ్ల ప్రదర్శన గోడపత్రికను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ఒంగోలు జాతి ఎడ్లు ఎంతో ప్రఖ్యాతి గాంచాయని అన్నారు. ఈ సందర్భంగా దర్శిలోని పొదిలి రోడ్డులో గల తన గృహం సమీపాన ఈ ఎడ్లప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యూ కేటగిరి ఎడ్లప్రదర్శనకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.80 వేలు, మూడో బహుమతి రూ.70 వేలు, నాల్గో బహుమతి రూ.60 వేలు, ఐదో బహుమతి రూ.50 వేలు, ఆరో బహుమతి రూ.40 వేలు, ఏడో బహుమతి రూ.30 వేలు, ఎనిమిదో బహుమతి రూ.20 వేలు, తొమ్మిదో బహుమతి రూ.15 వేలు, పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.7 వేలు కన్సోలేషన్ బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. ఎడ్ల బలప్రదర్శనలో గతంలో ఎన్నడూ లేని విధంగా సీనియర్ సైజ్ విజేతలకు మొదటి బహుమతి రూ.2 లక్షలు, రెండో బహుమతి రూ.1.60ల క్షలు, మూడో బహుమతి రూ.1.20 లక్షలు, నాల్గో బహుమతి రూ.లక్ష, ఐదో బహుమతి రూ.75 వేలు, ఆరో బహుమతి రూ.50 వేలు, ఏడో బహుమతి రూ.25 వేలు, ఎనిమిదో బహుమతి రూ.20 వేలు, తొమ్మిదో బహుమతి రూ.15 వేలు.. పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.7వేలు కన్సోలేషన్ బహుమతి అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులతో పాటు అనేక మంది ప్రజాప్రతినిధులు వస్తారని అన్నారు. ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ స్థాయి పాస్టర్లకు 550మందికి బట్టల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం బలప్రదర్శన జరిగే స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరక్టర్ డాక్టర్ ఎస్‌ఎం భాషా, కురిచేడు, ముండ్లమూరు జడ్పీటీసీలు నుసుం నాగిరెడ్డి, రత్నం రాజు, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, దర్శి ఎంపీపీ గోళ్ళపాటి సుధారాణి అచ్చయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ ఎంపీపీలు వీరగంధం కోటయ్య, ఇత్తడి దేవదానం, మాజీ సర్పంచ్‌లు కాకర్ల కృష్ణారెడ్డి, చింతలపూడి శ్రీనివాసరెడ్డి, గురవారెడ్డి, నాయకులు సూదిదేవర అంజయ్య, లింగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అప్పిరెడ్డి, వెంగలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 24న రాష్ట్ర సదస్సు

## స్త్రీ విముక్తి సంఘటన నేతల పిలుపు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**


స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో 'మహిళల సమస్యలు - కర్తవ్యాలు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు ఒంగోలు వేమూరు కళ్యాణమండపంలో ఈ నెల 24న జరుగుతుందని, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని సంఘటన నేతలు తెలిపారు. ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు రైతుకూలీలుగా, చిన్న, సన్నకారు రైతులుగా, అసంఘటిత రంగ శ్రామికులుగా చాకిరీ చేస్తూ తీవ్రమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన సాగిస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నామన్నారు. మహిళల సమస్యలు - కర్తవ్యాలు అనే అంశంపై ఈనెల 24న ఒంగోలులోని వేమూరు కళ్యాణ మండపంలో స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో ఏపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.మంజుల వైద్య, ఆరోగ్య శాఖ విశ్రాంత అదనపు సంచాలకులు డాక్టర్ నీరద, రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ తదితరులు ప్రసంగిస్తారన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైత కూలి సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్.లలితకుమారి, సంఘటన అధ్యక్ష, కార్యదర్శులు రేణుక, శాంతకుమారి పాల్గొన్నారు.

# రైతులను ఆదుకునేందుకు సత్వర చర్యలు

- నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేస్తున్నాం..
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

'తుపాను కారణంగా జిల్లాలోని రైతులు అపారంగా నష్టపోయారు. లక్షలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటమునిగి దెబ్బతిన్న పంట నష్టం వివరాల జాబితాను సిద్ధం చేస్తున్నాం. తుపానుతో ఏ ఒక్క రైతూ నష్టపోకూడదన్న ఆలోచనతో సిబ్బందిని టీములుగా ఏర్పాటుచేసి సమగ్ర సర్వే జరుపుతున్నాం.' జిల్లా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్‌సత్తార్ తెలిపారు. రైతులను ఆదుకునేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామంటున్న ఆయనతో ముఖాముఖి..




ఇటీవల మిచౌంగ్ తుపాను బాపట్ల వద్దనే తీరం దాటిన నేపథ్యంలో జిల్లాలో పలురకాల పంటలకు తీవ్ర-నష్టం వాటిల్లింది. ముఖ్యంగా రైతుల చేతికందే దశలో ఉన్న వరి పైరు నీట మునిగిపోయింది. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి బాపట్ల వచ్చి పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించి తక్షణమే నష్టం అంచనాలను తయారు చేసి నివేదిక పంపాలని ఆదేశించారు.

తుపాను నష్టం అంచనాలను పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన కేంద్ర బందం అమర్తలూరు మండలం ఇంటూరు, గోవాడ గ్రాయ పొలాలలో పర్యటించారు. నీట మునిగిన వరి పంటను స్వయంగా పరిశీలించారు. గోవాడ సచివాలయంలో ఏర్పాటు చేసిన పంటనష్టంకు సంబంధించిన ఫొటో ప్రదర్శనను బందం సభ్యులు చూసి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 317 గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో మొత్తంగా 93,244 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వరి పైరు 75,411 హెక్టార్లలో దెబ్బతింది. 363 హెక్టార్లలో వేరుశనగ పంట, 9,232 హెక్టార్లలో పొగాకు పంట, 238 హెక్టార్లలో జొన్న, 3,530 హెక్టార్లలో మొక్కజొన్న, 738 హెక్టార్లలో కంది పంట, 1,129 హెక్టార్లలో పత్తి, 2,034 హెక్టార్లలో మినుము, 50 హెక్టార్లలో చెరుకు, 446 హెక్టార్లలో జనపనార, 73 హెక్టార్లలో పెసర పంటలు దెబ్బతిన్నాయని ప్రాథమికంగా అంచనాలు వేశారు.

**నెలాఖరు నాటికి తుది జాబితా**

జిల్లాలో జరిగిన పంటల నష్టం అంచనాల తయారు కోసం సర్వే బృందాన్ని గ్రామ స్థాయిలో విఆర్‌ఓ, విఆర్‌ఏ, విలేజ్ సర్వేయర్‌లతో ఏర్పాటు చేశాం.. సర్వే వేగంగా జరుగుతుంది. నష్టపోయిన రైతుల వివరాలను సచివాలయాల వద్ద ఈ నెల 22వ తేదీ నాటికి ప్రదర్శిస్తారు. అభ్యంతరాల స్వీకరణ తరువాత 26వ తేదీన తుది జాబితా విడుదల చేస్తారు.

**యంత్ర పరికరాల మంజూరు**

వ్యవసాయంలో రైతులకు అవసరైన యంత్ర పరికరాలను అందించి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం అమలులో ఉంది. జిల్లాలో ఉన్న రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అధునాతన వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై ఇస్తున్నారు. ఇందుకోసం రైతులతో కస్టమ్ హయ్యర్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వ్యవసాయ యంత్ర పరికరాల పట్ల ఆసక్తి ఉన్న ఐదుగురు రైతులతో కమిటీలు ఏర్పాటు చేసి, సహకార బ్యాంకుల ద్వారా ట్రాక్టర్లు, డ్రోన్లు, వరి నూర్పిడి యంత్రాలతో పాటు పలు చిన్నపాటి యంత్రపరికరాలు ఇస్తున్నారు. యంత్ర పరికరాలు పొందిన రైతులు తాము ఉపయోగించుకుంటూ, గ్రామంలో అవసరమైన రైతులకు వాటిని అద్దెకు ఇవ్వడం ద్వారా సొంత ఆదాయం పొందవచ్చు. జిల్లాలో ఉన్న 409 రైతు భరోసా కేంద్రాలకు అనుబంధంగా కస్టమ్ హయ్యర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు రెండు విడతలుగా 266 ట్రాక్టర్లు ఇచ్చారు. వరి నూర్పిడి యంత్రాలు ఏడు ఇచ్చారు. తైవాన్ స్ప్రేయర్లు, పవర్‌టిల్లర్లు, కల్టివేటర్లు, రోటవేటర్లు ఇచ్చారు. మొత్తంగా జిల్లాలో ఈ పథకం ద్వారా రూ.12.54 కోట్ల విలువైన యంత్రపరికరాలు మంజూరయ్యాయి. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం కోసం రైతులకు తగిన శిక్షణ ఇచ్చి డ్రోన్లు మంజూరు చేసేందుకు తగిన ప్రణాళిక రూపొందించారు.

**ఆర్‌బికె ద్వారా బహుముఖ సేవలు**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన రైతు భరోసా కేంద్రాల ద్వారా భూసార పరీక్షల నుంచి పంట సాగులో మెళకువలు తెలియజేయడం, రైతులకు కావలసిన సమగ్ర సాంకేతిక పరిజ్ఞానం అందించడం, సబ్సిడీపై యంత్ర సామాగ్రిని అందించడం, పొలంబడి ద్వారా వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు రైతుల వద్దకు చేరేలా రైతు భరోసా కేంద్రాల ద్వారా కృషి జరుగుతుంది. వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎమ్ కిసాన్ పెట్టుబడి సాయం, మట్టి నమూనాల సేకరణ, విత్తనాల పంపిణీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాల నిర్వహణ, రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీ, ఈ-క్రాప్ నమోదు, రైతు గ్రూపుల ఏర్పాటు ద్వారా బహుముఖ సేవలు అందిస్తున్నారు.

**అందుబాటులోకి భూసార పరీక్షలు**

రైతు భరోసా కేంద్రాల ద్వారా భూసార పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. అగ్రి ల్యాబ్‌లు రైతులకు అందుబాటులోకి రానున్నాయి. భూసార పరీక్షలు జరిపి సాయిల్ హెల్త్ మేనేజ్‌మెంట్ కార్డులు ఇవ్వడం జరుగుతుంది. పంటల దిగుబడికి భూసారమే కీలకమైన నేపథ్యంలో ప్రతి ఆర్‌బికె నుంచి ముందుగా రెండు చొప్పున మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షల కోసం ప్రాంతీయ భూసార పరీక్షా కేంద్రాలకు పంపడం జరుగుతుంది. పోషక లోపాలు గుర్తించి రైతులకు సలహాలు ఇస్తున్నారు. భూసార పరీక్షలు జరిపి పంటల సాగు భూమిలో ఏవి లోపించాయో తెలుసుకుని తదనుగుణంగా రైతులకు అవసరమైన జిప్సం, బోరాన్, జింక్‌లను ఇస్తాం.

**ఈ-పంట నమోదు**

జిల్లాలో వివిధ పంటల సాగు చేస్తున్న రైతులు విధిగా పంటల నమోదు చేసుకోవాలి. రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలు ధృవీకరణ జరిపి తప్పనిసరిగా ఈకేవైసి చేయించుకోవాలి. ఈ పంట నమోదయితేనే రైతుభరోసా, పంటల బీమా, పంట నష్టపరిహారం, ధాన్యం సేకరణ, సున్నా వడ్డీ పంట రుణాలు, సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇవ్వడం సాధ్యపడుతుంది.